


మెయిలు కూత వేసి కదలడం ప్రారంభించింది. అది జీవన సమరాన్ని జయించి గమ్యస్థానం చేరుకోవాలనే, మాధ్యమిక కుటుంబ వ్యవస్థలా ఉదయ కిరణాలను పలకరిస్తూ వేగాన్ని పుంజుకుంటోంది.

హరికి వొళ్ళు గగుర్పొడిచింది. వేగంలోనూ, తను యెలా రైలు యెక్కాడో! మెయిలంత రద్దీ లేదనుకున్నాడు. కానీ యెదురుగా వస్తున్న కండక్టరుని చూచి తన అంచనా తప్పేనని అనుకున్నాడు. అది త్రీటైరు బోగీ ముందు ఖాళీ లేదన్న కండక్టరు హరి చేతిలో పది రూపాయల నోటు చూడగానే ఖాళీ కనిపించింది, చార్టులో. కండక్టరిచ్చిన బెర్తు నెంబరు క్రిందనే వుంది. దాని మీద లెదర్ బాక్సు, బ్రీఫ్‌కేసు పడేసి "హమ్మయ్య!" అంటూ హాయిగా వూపిరి తీసాడు, హరి. జీవితాన్ని నిర్దుష్టంగా సరిదిద్దుకున్నంతగానే సంతృప్తి పొందాడు.

విండోలోనుండి బయటకు చూసాడు హరి. తన వూరు బరంపురం, కోవెలలూ, కోనేర్లూ, యివన్నీ వొక్కొక్కటి తనకి దూరమవుతున్నాయి. రైలు వేగంతోపాటు, పచ్చని పచ్చిక పంటపొలాలు, రాళ్ళూ రప్పలూ, వంకలూ, వొకటేమిటి సర్వ చరాచర ప్రపంచం, చుట్టూ పరిభ్రమిస్తున్నట్లుగా భావన.

బెర్తు పైకి చూశాడు హరి. యెవ్వరో యిద్దరు యువకులు స్పోర్ట్సు బనియన్లు తొడుక్కొని నిద్రపోతున్నారు. క్రింద యెదురు బెర్తుమీద యెవ్వరూ లేరు. కానీ దాని మీద పరచిన బెడ్డింగు మీద టర్కీ టవల్, అస్తవ్యస్తంగా గాలికి యెగురుతున్న ఫెమినా, ఫిల్మ్‌ఫేర్ పత్రికలు కనిపించాయి. కింద ప్లాస్టిక్ బుట్టలో రెండు ఎర్రటి యాపిల్సు, కమలా పళ్ళూ వున్నాయి.

ఫిల్మ్‌ఫేరు పేజీలు తిరగేస్తూ, తారల

రంగుల జీవిత విశేషాల్ని, సంఘటనల్ని చదవటంతో లీనమయిపోయాడు.

"ఎక్స్యూజ్ మీ! కాలు కొంచెం. "

ఏకాగ్రతకు భంగమే కలిగి పుస్తకంలో నుండి తలెత్తి చూశాడు. యెదురుగా అపరంజి బొమ్మ చేనేత చీరలో చాలా అందంగా నిరాడంబరంగా వుంది. ఆమె చేతిలో వూదారంగు టర్కీటవల్, దువ్వెనా వుంది.

"సారీ.. "

"యిట్సాల్ రైట్" ఆమె కూర్చుంది.

"బై దిబై! మీ పర్మిషను లేకుండా పుస్తకం తీసాను."

"ఫర్వాలేదు చదువుకోవడానికే కదా!" అంటూనే గాలికి అస్తవ్యస్తంగా యెగురుతున్న ముంగురులను అదుపులోనికి తేవడానికి గ్లాస్ డోర్సు దించిందామె.

హరి మళ్ళా మేగజైనులో తల దూర్చాడు. యింతవరకూ అందంగా కనిపించిన ఆ తార అంతా, అతనికి కృత్రిమ సౌందర్యంతో వెలిసిపోతున్నట్లుగా కనిపించారు.

ఆమెవేపు చూసాడు. కిటికీలో నుండి అరుణ కిరణాలు, ఆమె వినీల కుంతలాల్ని కౌగిలించుకుంటున్నాయి. వాయుదేవుడు నేను మాత్రం తీసిపోయానా అంటూ యెలాగో సందు చేసుకొని ఆమె నిడుపాటి కురుల్ని చిందరవందర చేస్తున్నాడు. వాటిని లొంగదిసుకోవాలన్న ఆమె ప్రయత్నం విఫలమే అయింది. పరిస్థితి గమనించిన హరి తనవేపునున్న గ్లాస్ డోర్సు దించాడు.

"థాంక్యూ!" అంది అతనివేపు చూసి. సన్నగా కాటుక రేఖతో మెరసి పోతున్న గుండ్రని కళ్ళలో యేదో విపరీతమైన ఆకర్షణ కనిపించింది.

"యెక్కడనుండి వస్తున్నారు? ."

"భువనేశ్వర్ నుండి నెల్లూరు వెళుతున్నాను. మీరు..." ఆగిపోయింది. టాయిలెట్ జాక్సులో వున్న అద్దంలో తన ముఖం చూసుకుంటూ.

"నేను మద్రాసండి. " అన్నాడు కొంచెం గర్వంగా.

ఆమె చేతిలో రంగుల దువ్వెనను చూస్తూ సన్నని నిడుపాటి వేళ్ళు చాలా అందంగా వున్నాయి. ఉంగరం వేటకు పొందికగా అమరిన కెంపు వుంగరం తళతళ మెరిసిపోతోంది.

"థాంక్ గాడ్! అయితే చివరివరకూ కంపెనీ వుంటుందన్న మాట" అంది సంతృప్తిగా.

"ష్యూర్.. ష్యూర్" అన్నాడు ఆనందంగా.

"రైలు ప్రయాణానికి జీవితంలో ప్రయాణించడానికి చాలా పోలికలు వున్నాయండి "

ఆమె కళ్ళింతలు చేసుకుంది.

"అవునండి. రైలు ప్రయాణానికి ముందు మనం జాగ్రత్త రిజర్వు చేసుకుంటే ఆ ప్రయాణం చాలా సౌకర్యవంతంగా, యే ఆరాటమూ లేకుండా జరుగుతుంది. అలాగే జీవితంలోగూడా ప్రతీదానికి ముందు జాగ్రత్తపడితే చాలా సౌకర్యవంతంగా కొనసాగుతుంది" అన్నాడు. రైలు యేదో స్టేషను అవుటర్ సిగ్నల్ని అరుచుకుంటూ దాటేసింది.

"లేకపోతే కొనసాగటం కష్టమా?" ప్రశ్నించింది.


తడబడ బడ్డాడు హరి.

"కష్టం యేమీ లేదనుకోండి. అయితే ఆ జీవితంలో యెక్కడో సుడివుంటే అందంగా సాగుతుంది" అన్నాడు.

"వివరంగా చెప్పండి బోధపడలేదు" అంది సందేహాత్మకంగా.

"ఉదాహరణకు నా సంగతే తీసుకోండి. మా డాడీ ఫోన్ చేసి పస్టుక్లాసు రిజర్వేషను కోసం ట్రై చేసారు. కానీ ఖాళీల్లేవు. వెధవ సెకండ్ క్లాస్ లో నువ్వు ప్రయాణం చెయ్యలేవు. అసలు మద్రాసు ప్రయాణం మానుకోమన్నారు. కానీ వెడతానని పట్టుపట్టాను. "

ఆమె వుత్సాహంగా వింటోంది, కొంచెం ముందుకు వంగి. బారైన జడ భుజంమీదుగా క్రిందకు వేలాడింది. సంపెంగ మొగ్గలాంటి ముక్కు, పెదవి చివర పుట్టుమచ్చ హరిని మరింత పరవశుడ్ని చేసింది. ఆమె మెడలో సన్నని బంగారపు గొలుసు మెరుస్తోంది.




"అసలు మా డాడీకి నేను వుద్యోగం చేయటం యిష్టంలేదు. వొక్కగా నొక్క కొడుకుని. యింతాస్థి చాలదా! యెందుకా ముష్టి వుద్యోగం. దానికోసం మద్రాసు యింటర్వ్యూ అని కోపం" అన్నాడు.

ఆమె కమలాపండు తీసింది.

"ఇంతకీ ఏమిటా యింటర్వ్యూ? ఎక్కడ?" తలయెత్తి అడిగింది, చిత్రంగా క్రీగంట చూసి.

"గోపాలదాస్ జమునాదాస్ ఎక్స్‌పోర్టర్స్‌లో నుండి. చదివిన చదువుకు, వుద్యోగం కొంచెం చిన్నదయినా ముందు ముందు మంచి అవకాశా లుంటాయని....బై ది బై మీ పేరు చెప్పారు కాదు. "

"మీరడగలేదుగా... నా పేరు శాంతి" అంది కమలా ఫలం వొలుస్తూ.

"నా పేరు హరి. శాంతిగారూ యింతకీ అసలు విషయం చెప్పలేదు. వొకపూట నిరాహార దీక్ష చేస్తేగానీ, యీ వుదయం మా డాడీ ప్రసన్నులు కాలేదు. అప్పటికీ ఫోన్‌చేస్తే త్రైన్ క్లియరయిపోయిందన్నారు మెయిలుకి. అంతే. అదరా బాదరగా రావటం, కదులుతున్న రైలెక్కడం.... రిజర్వేషను దొరకడం. యిదంటి సుడి. అసలు డాడీ కారు తీసికెళ్ళమన్నారు. కానీ దూరప్రయాణం. వొళ్ళు పులిపోతుంది. అయినా రేపు వుదయంకు చేరలేం కదా" అన్నాడు నవ్వి. శాంతి అతనివేపు చూసింది. ఉంగరాల జుట్టు. సన్నని మీసకట్టుతో చాలా అందంగా వున్నాడు. కళ్ళలో వొకరకమైన ఆకర్షణ.

"ఇంతకీ యేం చదివారు మీరు " అసంతృప్తిగానే అడిగింది.

"ఏం. కాం. ఫస్టుక్లాసులో పాసయ్యానండి. ఏదో కాస్త కాలక్షేపం. ఉద్యోగం పురుషలక్షణం. యెప్పుడు యిష్టం లేకపోతే అప్పుడే వచ్చేయచ్చు. యింతకీ మీరేం చదివారు?"

"ఇంటర్మీడియట్ కన్నా యెక్కువ చదవలేదులెండి..." అంటూ కమలా తొనలు అతని చేతిలో పెట్టింది.

"థాంక్సు."

"ప్రతిదానికీ థాంక్సు చెప్పొద్దు. నెల్లూరులో దిగినప్పుడు మొత్తం చెబుదురుగానీ...."

"థాంక్సండి....మంచి సలహా యిచ్చారు" యిద్దరూ నవ్వుకున్నారు. రైలు పలాసాలో ఆగింది. ప్రయాణీకులు కాఫీ త్రాగుతున్నారు.

"ఏం తీసుకుందాం బ్రేక్‌ఫాస్ట్, బ్రెడ్

బట్టర్ జామ్ " అన్నాడు ఆసక్తిగా ఆమె వేపు చూసి.

"అబ్బే వద్దండి. యిడ్లీ, వడ తీసుకుందాం" అంది లేస్తూ.

"హమ్మయ్య రక్షించేరు. యింటో రోజూ తిని మొహం మొత్తేసింది. వుండండి నేనే తెస్తాను" లేచాడు. శాంతి వారించినా వినలేదు.

మళ్ళీ రైలు కదిలింది. వాళ్ళిద్దరూ మాటల్లో పడ్డారు! యువతీ యువకుల మధ్య వుండే ఆకర్షణ కాంతి అలాంటిది.

"ఏమయినా మీరు ఒంటరిగా ప్రయాణం చేయటం సాహసమే మరి" అన్నాడు.

"ఏం " అంది ఆశ్చర్యంగా ఫెమీనా చేతిలోకి తీసుకొని.

"నెల్లూరు చేరేసరికి అర్ధరాత్రి దాటుతుంది కదా. "

"అదా మీ భయం. . మా వాళ్ళు వచ్చి నన్ను రిసీవ్ చేసుకుంటారు." అంది నవ్వి.

"ఏం పనిమీద వెళుతున్నారా?"

"మా కజిన్ బ్రదర్ ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంటులో యింజనీరుగా పని చేస్తున్నాడు. మా పిన్నికి ఒంట్లో బాగులేకపోతే సహాయంకోసం వెళుతున్నాను" అంది ఫెమినా పుస్తకం తెరుస్తూ.

కాస్సేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం. మీద బెర్తుకుర్రాళ్ళు హిందీ పాటలు పాడుకుంటున్నారు.

"మీరు యింటర్మీడియట్‌తో యెందుకు చదువాపేసారు?"

హరికి పుస్తకం మీద మనసు లగ్నం కావటం లేదు. శాంతి మనసుగూడా అలాగే వుంది.

"ఏమోనండి! నాకంత చదవాలనిపించలేదు" పుస్తకం మూసేసింది.

"మరి యింటి దగ్గర యెలాగ గడుపుతారు?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు.

"ఏముంది - మ్యాగజైన్స్, సినిమాలు, స్నేహితులు."

"మీకు బ్రదర్స్, సిస్టర్స్ ."

"ఎవ్వరూ లేరండి. నేనొక్కర్తినే సంతానం" నవ్వింది ఆమె.

"ఎనీ మేరేజ్ ప్రపోజల్స్" అడిగాడు, కాస్త జంకుగానే. సిగ్గుపడింది శాంతి.

"లేదండి! ఈ విషయంలో మా ఫాదర్, మదర్ నాకు స్వేచ్ఛ యిచ్చారండి! మనసుకు నచ్చిన వ్యక్తి దొరకాలి కదా!" అంది క్రీగంటన చూస్తూ.

"మీల్స్ టికెట్స్ వైజాగ్ సార్" అని ఎటెండెంట్ రావటంతో సంభాషణ కట్ అయిపోయింది. శాంతి మీల్స్ టికెట్స్ తీసుకుంది హరి వారిస్తున్నా.

"హేవ్ యూ గాట్ మేచ్ బాక్స్" బెంగాలీ ప్రయాణీకుడు అడిగాడు.

"నో సర్!" సమాధాన మిచ్చాడు హరి పానకంలో పుడకలా వీడెవడో అని కోపంగా చూసి.

"అదేమిటి మీరు సిగరెట్లు త్రాగరా?" ఆశ్చర్యంగానే అడిగింది.

"నాకు సిగరెట్లన్నా, కాఫీ, టీలు విపరీతంగా త్రాగటమన్నా అసహ్యం! మా నాన్న అమ్మల, పెంపకం అలాంటిది."

"చాలా గొప్పవాళ్ళండి మీ తల్లిదండ్రులు."

"నిజమేనండి! యెంత క్రమశిక్షణతో పెంచారో, అంత స్వతంత్రం యిచ్చారు నాకు. వివాహ విషయంలో" అన్నాడు, ఆమె కళ్ళల్లోకి చూస్తూ.

"ఎనీ ప్రపోజల్స్ . " అతనెంత సునువుగా అడిగాడో ఆమెగూడా అలాగే అడిగింది.

"లేదండి! ఇంకా అన్వేషణలోనే వున్నాను. మా వాళ్ళకు కులమత భేదాలు, పట్టింపులూ లేవు" అన్నాడు నెమ్మదిగా ఫిల్మ్‌ఫేర్ పత్రిక చూస్తూ.

చదువుకున్న సభ్యతా సంస్కారం గల యువతీ యువకుల మధ్య సంభాషణ యెలా సాగాలో అలాగే సాగుతోంది, వాళ్ళిద్దరి మధ్య

"పేరు హరి, చాలా అందంగానూ, ఉన్నతమైన విద్యతో సంస్కారం గల యువకుడు. ఈతన్ని యెవరు చేపడతారో ఆమె అదృష్టవంతురాలు" అనుకుంది మనస్సులో శాంతి, అతను కిటికీలోనుంచి ప్రకృతివేపు చూస్తుంటే.




"ఆ అదృష్టవంతురాలివి నువ్వే యెందుకు కాకూడదూ!" శాంతిలో వున్న అంతరాత్మ ప్రశ్న.

విశాఖపట్నంలో కాంటినులో భోజనం చేశారు యిద్దరూ! స్టేషనులో, అరటి దొన్నెలలో పెట్టిన తాజా సంపెంగ పువ్వులు కొంది శాంతి.

"మీ రింటి కెళ్ళాక బాగా దిష్టి తీయించుకోవాలి."

"యేం?" కళ్ళతోనే అడిగింది అర్థంకాక.

"చూసారా! ప్లాట్‌ఫారం మీద అందరి కళ్ళు మీమీదనే.. యెవరీ అపరంజి బొమ్మ, అప్సరస అని చూస్తున్నారు" అన్నాడు గర్వంగా ఆమె ప్రక్కగా నడుస్తూ.

నిజమే హరి చెప్పింది. శాంతి ఆ విషయం గమనించలేదు. ఆమె బుగ్గలు గులాబీలే అయ్యాయి.

మళ్ళా రైలు కదిలింది. సఖ్యం సాప్తపదీనం సన్నిహితులయినారు. యిద్దరి అభిప్రాయాలునూ వొకరికొకరు గౌరవించుకుంటున్నారు.

"తిన్నా తరగని ఆస్తి ఏడు తరాలవరకూ సరిపోతుంది. మాకు అసలు కట్నం ఆశే లేదు. దీన్ని నేను కాలేజీలో వ్యతిరేకించి పెద్ద వుద్యమం నడిపాను" అన్నాడు.

"నేను వొక్కగా నొక్క కూతుర్నే. మా నాన్నగారూ! అమ్మగారూ నేనూ, వ్యక్తిగతంగా దీనికి వ్యతిరేకులం. అన్నీ లాంఛనాల రూపం లోనే యిస్తారు...."

చిత్రంగా సాగుతోంది వర్ణాంతర వివాహాల మీద, వరకట్న నిషేధంమీద, అభిప్రాయాల మార్పిడి జరుగుతోంది. శాంతి పువ్వులు మాల కడుతూంటే, ఆమె అందాన్ని తదేకంగా చూస్తున్నాడు. రైలు రాజమండ్రీ దాటుతూండగానే ఆమె ముఖంకడుక్కుని పెద్ద పువ్వుల ఖటావ్ వాయిలుచీర కట్టుకుంది. అది తన కంచిరంగు చీర.

"చాలా బాగున్నారా చీరలో" అన్నాడు ప్రశంసాపూర్వకంగా.

ఆమె సిగ్గుతో నవ్వింది క్రీగంట చూస్తూ.

"నేనేదో సరదాగా మాట్లాడుతున్నాను. యేమాత్రం సౌందర్యంలో లాలిత్యం కనబడినా నాకు మనసులో అది బయటకు చెప్పేసేదాకా వుండలేను మీరుమరోలా అనుకోటంలేదుకదా!"

"లేదండీ నాకు అలాంటి వాళ్ళంటే ఎంతో అభిమానం" అతని కళ్ళల్లోకి ఆత్మీయంగా చూస్తూ.

రైలు బెజవాడ చేరుకుంటున్నది. కొండ మీద కనకదుర్గ కోవెల కోటి ప్రభలతో ఉజ్వల కాంతులీనుతోంది. శాంతి మనస్సులోనే నమస్కరించింది. బెజవాడ రైల్వే రెస్టారెంట్‌లో హరి ప్రక్కన కూర్చుని భోజనం చేయటంలో ఆమె చిత్రమైన అనుభూతి పొందింది. తర్వాత మేగజైన్సు కొంది శాంతి.

"మీరు సమంగా భోజనం చేయలేదు. కాస్త పళ్ళయినా తీసుకుంటాను" ఆపిల్సు ద్రాక్ష తీసుకున్నాడు.

హరి తనపట్ల చూపిన శ్రద్ధకు ముగ్ధురాలై పోయింది.

"యెంతో బోరుగా ప్రయాణం సాగుతుందోనని భయపడ్డాను, కానీ గంటలు క్షణాలలా దొర్లిపోయాయి. మీవల్ల " అంది ప్రశంసా పూర్వకంగా.

"నాకు అంతేనండీ. " అన్నాడు ఏపిల్ పండు కోసి ఆమె చేతికిస్తూ. తెనాలి దాటిపోతోంది రైలు.

"మెద్రాసునుండి వచ్చేటప్పుడు నెల్లూరులో దిగండి. మా కజిన్‌కు పరిచయం చేస్తాను" అంటూ ఎడ్రసు యిచ్చింది.

"అలాగే మీ యింటి ఎడ్రసు గూడా యివ్వండి" అన్నాడు.

ఆమె వొక్కసారి హరివేపు చూసి నును సిగ్గుతో రాసింది.

"మరి మీ ఎడ్రసో—"

"నా ఎడ్రసు, వివరాలూ, అన్నీ భువనేశ్వర్‌లో తెలుపుకుంటాను మేడమ్ " అన్నాడు చిలిపిగా.

హరికి నిద్ర వస్తోంది. బ్రీఫ్‌కేస్‌లో నుండి బెడ్‌షీటు తీసి వేసుకున్నాడు.

"గుడ్‌నైట్" అంది శాంతి.

o o o

కరుగుతున్న చీకటి తెరల మధ్య రైలు మద్రాసు చేరింది. రైల్వే కూలీల అరుపులతో హరికి మెలకువ వచ్చింది. నెల్లూరులో మెలకువ రానందుకు తనలో తనే తిట్టుకున్నాడు. శాంతితో ప్రయాణపు అనుభూతుల్ని తలచుకుంటూనే బెడ్‌షీట్ మడతబెడుతూంటే రెండు ఉత్తరాలు క్రిందపడ్డాయి. ఆతృతగానే తీసాడు.

హరిగారూ!


మీతో ప్రయాణం తీయని కలలా గడిచింది. అలాగే జీవితాంతం ప్రయాణం చేయడానికి నిశ్చయానికి వస్తున్న సమయంలో యీ కల పీడకల అని అనురాగ రాగంతో అపశృతితో మేళవింపని మీ సభ్యతా సంస్కారాల వెనక యెంత ఫాల్సు ప్రెస్టేజీ వుందో తెలిసేసరికి యెంత బాధపడాల్సి వస్తుందో. ..

రాత్రి మీరు బెట్‌షీటు వేసేటప్పుడు గాబోలు వొక ఉత్తరం క్రిందపడి వుంటుంది. అర్ధరాత్రి నేను చూసాను. తెరచి చూసేసరికి మీ పేరు కన్పించింది.

చదవకూడదనుకోవటం సభ్యతయినా, అలవోకగా కన్పించిన పదాలు, నన్నుమాత్రం చదవనివ్వకుండా వుండలేదు. నా వుత్తరం చదివిన తరువాత మీ అక్కయ్య రాసిన మొత్తం వుత్తరం చదవండి. ఆమె గుండెలు యెంత క్షోభపడితే గానీ అలాంటి వుత్తరం రాయగలుగుతుందో ఆలోచించండి.

"తమ్ముడు హరీ!

నేనూ నీ చిన్నక్క, మరి నలుగురు చెల్లెళ్ళ బ్రతికినంత కాలం బస్సు కండక్టరు చేసి, చూపానదని తీసేసిన తర్వాత కాన్సరు వ్యాధి బహుమానంగా తెచ్చుకున్న నాన్న నరాల జబ్బుతో బలహీన మవుతున్న అమ్మల గుండెల మీద ఆరని కుంపట్లం. సాంప్రదాయాల పేరిట చదువులేక నేనూ చిన్నక్క, మిగిలిన వాళ్ళూ చదువుకున్నా ఉద్యోగం చేసే అర్హత వయస్సు రాక వాళ్ళు మరో బ్రతుకు దారిలేక, చావలేక బ్రతుకు బాటలో ముళ్ళకంచెల్లా తయారయి




వున్నాం.

నాన్న నీవు చదువుకొని, కుటుంబాన్నంతా వుద్ధరిస్తావని రక్తంచుక్కలు చెమటగా మార్చి, నా పెండ్లి చెయ్యకుండా గూడా నీకు చదివించాడు. కానీ నీవో అర్థంలేని ఆడంబరాలతో, వ్యసనాల బలహీనతలో నిరుద్యోగిగా డంబ జీవితాన్ని గడుపుతున్నావు. యింట్లో యెవరు తిన్నా, తినకపోయినా, నీకు యేలోటు లేకుండా రాకుండా యెలా చూస్తున్నామో! నీకు తెలియదు. అసలు యింటి దగ్గర వుంటేకదా! నీకేమయినా తెలిసేది.

నువ్వయితే ఎరుపు లెదర్ బాక్సు, బ్రీఫ్ కేసు తేగలిగావు గానీ మద్రాసు ప్రయాణానికి డబ్బు సంపాదించుకోగలిగావా? అమ్మ ఎప్పుడో మంగళసూత్రానికి బదులుగా పసుపుకొమ్ము కట్టుకొంటున్నాది. నీకు డబ్బు యెలా ఇచ్చానో తెలిస్తే గుండె పగిలిపోతుంది.

యేమైనా నీవు వుద్యోగం ఈసారి సంపాదించుకోవాలి. ఈ డబ్బుతో మద్రాసులో విలాస జీవితం గడపకు. ఉద్యోగం వస్తే సరేసరి. లేకపోతే మాత్రం తిరిగి యింటికి రాకు. అమ్మకి, నాన్నకి మరింత వ్యధ తెచ్చిపెట్టకు. కష్టాల బరువుతో ప్రయాణిస్తున్న ఈ బండి బరువులో నుండి వొకరు తగ్గినా తగినట్లే. చదువుకున్న వాడివి. కొంచెం నిశితంగా ఆలోచించు ."

. చదువుతున్న నాకే కళ్ళలో జలపాతాలు సుడులు తిరుగుతున్నాయి, ఎంత బాధపడ్డానో!

"మరో ముఖ్య విషయం. ఎమ్.కామ్. ఫస్ట్ క్లాసులో ప్యాసయిన నాకూ, అదే కంపెనీకి యింటర్వ్యూ వచ్చింది. ఆ రెండో వ్యక్తిని నేనే. ఉద్యోగం చేయవలసిన అవసరం, పరిస్థితులు నాకంత లేవుగానీ ఊరికే కూర్చోవటం యిష్టంలేదు. అందుకనే నెల్లూరులో దిగి, మా కజిన్ బ్రదర్‌తో కలిసి మద్రాసు యింటర్వ్యూకు వద్దామనుకున్నాను.కానీ యిప్పుడురావటంలేదు.

యెందుకో తెలుసా!

మీకే ఆ వుద్యోగం వస్తుంది. అప్పుడు దిగువ తరగతి మాధ్యమిక కుటుంబ జీవితం, కుక్కలు చింపిన విస్తరిలా కాకుండా ఆదుకున్న తృప్తి నాకు లభిస్తుంది.

రైలు ప్రయాణం లాగే మీ జీవితాన్ని నిర్దుష్టంగా సరిదిద్దుకోండి. జీవితంలో, నిజాయితీ, నిరాడంబరత, లక్ష్యశుద్ధి సత్యజీవనం యివన్నీ అవలంబించి సాగించండి. మీ ప్రయాణం. ఉద్యోగం దొరికిన తర్వాత నన్ను మళ్ళీ కలవాలని అనుకోవద్దు.

ఇట్లు
శాంతి

రైల్వే కూలి పిలిచిన పిలుపుకు, ఈ లోకంలోకి వచ్చి లెదర్ బాక్సు, బ్రీఫ్‌కేసూ, అతనికివ్వబోయి, మళ్ళా ఆ ప్రయత్నం మానుకుని రెండు చేతుల్తో పట్టుకొని బయటకు నడిచాడు హరి. □